క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ టౌన్: రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎలక్ట్రికల్ ఈఈ జీబీ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక చౌదరిపేటలో మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఆ ప్రాంత ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



గుడివాడరూరల్: రౌడీషీటర్లు తమ ప్రవర్తనను మార్చుకుని, నేరాలకు దూరంగా జీవించాలని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎన్.చంటిబాబు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న రౌడీషీటర్లు ప్రవర్తన మార్చుకోకపోతే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

శాకంబరిగా పార్వతీదేవి



పామర్రు: స్థానిక సోమేశ్వరస్వామి ఆలయంలోని పార్వతి అమ్మవారిని ఆషాఢ మాసం ఆదివారం సందర్భంగా శాకంబరీ దేవిగా అలంకరించి పూజలు చేశారు. తొలుత ఆలయంలో అమ్మవారికి పలు రకాల కూరగాయలతో అలంకరించారు. భక్తులు పువ్వాడ శ్రీనివాసరావు దంపతుల సౌజన్యంతో ఈ అలంకారం నిర్వహించారు. ఆలయ మేనేజర్ జన్ను వెంకటేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.

మురుగు నీటి సరఫరాను అరికట్టండి



గుడివాడ టౌన్: స్థానిక నాగవరప్పాడు పోలీస్ కాలనీలో కొన్ని రోజులుగా మంచినీటి కుళాయిలో మురుగునీరు వస్తోందని స్థానికులు అంటున్నారు. దీని వలన ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని చెబుతున్నారు. పురపాలక సంఘ సిబ్బందికి తెలియజేసినా.. సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. మున్సిపల్ కమిషనర్ ఈ విషయంపై దృష్టిపెట్టి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం

పమిడిముక్కల: మండలంలోని తాడంకి గ్రామంలో సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యురాలు యేనుగ వెంకటరమణ కుమారి పేర్కొన్నారు. తాడంకిలోని తమ నివాసంలో సమావేశం జరుగుతుందని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పాల్గొని సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



కూచిపూడి(మొవ్వ): ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మండల శాఖ, రోటరీ క్లబ్ కూచిపూడి ఆధ్వర్యంలో సమతా శంకర నేత్ర చికిత్సాలయం ఉయ్యూరు వారిచే నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కూచిపూడిలోని సంజీవని వైద్యాలయంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని కూచిపూడి ఎస్ఐ విశ్వనాథ్, గ్రామ సర్పంచ్ కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మితో కలిసి ప్రారంభించారు. సమత శంకర్ నేత్ర చికిత్సాలయ వైద్య నిపుణులు డాక్టర్ ఆదిత్య 160 మందికి పరీక్షలు నిర్వహించారు. 48 మందికి ఆపరేషన్లు చేయాల్సిన ఆవశ్యకత ఉందని నిర్ధారించారు. కార్యక్రమంలో మొవ్వ మండల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మండల శాఖ చైర్మన్ బెల్లకొండ వెంకటేశ్వరావు, రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు జొన్నలగడ్డ హనుమకుమార్, బీహెచ్‌వీఆర్ఎస్ సాయి, రొటేరియన్స్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీరందక అన్నదాతల ఇక్కట్లు

- నాట్లు వేసేందుకు పాట్లు
- ఆయిల్ ఇంజిన్లతో ఖర్చు తడిసి మోపెడు



కపిలేశ్వరపురం పరిధిలో నీరందక ఎండిపోతున్న వరి



కపిలేశ్వరపురం పరిధిలో నీరందక ఎండిపోతున్న నారుమడి

పమిడిముక్కల: మండలంలో వరినాట్లు వేసేందుకు రైతులు ఇబ్బందులుపడుతున్నారు. వర్షాలు పడక, సాగునీరందక పలుచోట్ల నారుమడులు, నాట్లు వేసిన పొలాలు ఎండిపోతున్నాయి. బోర్ల కింద నారు మడులు పోసి నాట్లు వేసుకున్న రైతులు ఎండిపోతున్న పొలాలను కాపాడుకోలేక అవస్థలు పడుతున్నారు. మండలంలోని కపిలేశ్వరపురం పరిధిలో నాలుగువేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఉయ్యూరు బస్టాండ్ పక్కనున్న కేటీ చానల్ నుంచి సాగునీరు రావాల్సి ఉంది. సాగునీరందక నాట్లు వేసేందుకు ఇబ్బందిపడుతున్నారు. నీరందకపోవడం అక్కడక్కడా నాట్లు వేసిన పొలాలు ఎండిపోతున్నాయి. కపిలేశ్వరపురం చానల్ పరిధిలో గరికపర్రు, మంటాడ, కపిలేశ్వరపురం, వేల్పూరు పరిధిలోని వేలాది ఎకరాల ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.



ట్రాక్టర్ ఇంజిన్‌తో పొలానికి నీరుపెడుతున్న దృశ్యం



మంటాడ పరిధిలో నాట్లు వేసేందుకు పొలాన్ని ఆయిల్ ఇంజిన్లతో తడుపుతున్న రైతులు

రూ.36 వేలు నష్టపోయా



నేను ఎనిమిది ఎకరాలు కౌలుకు చేస్తున్నాను. పొలం దుక్కి దున్ని, ఆయిల్ ఇంజిన్లతో నీరుపెట్టి వెదసాగు చేపట్టాను. నీరందక పంటంతా ఎండిపోయింది. మళ్లీ దుక్కి దున్ని నాట్లు వేసేందుకు ట్రాక్టర్ ఇంజిన్‌తో మురుగబోదెలోని నీటిని పొలంలోకి తరలిస్తున్నా. ఇప్పటికే దుక్కులు, విత్తనాలు, తడులకు రూ.36 వేలు పెట్టుబడి పెట్టి నష్టపోయాను. ఎకరాకు 15 బస్తాల కౌలు చెల్లించాల్సి ఉంది. మళ్లీ రూ.60 వేలు పెట్టుబడి పెట్టాల్సి ఉంది. సకాలంలో సాగునీరందిస్తే కొంతమేర ఇబ్బందులు తొలగుతాయి.

–పెనుమాక రాజు, కౌలు రైతు

పంటకాలువకు నీరందించాలి



నేను తొమ్మిది ఎకరాలు కౌలుకు చేస్తున్నాను. తాడంకి చానల్ ద్వారా సాగునీరు రావాల్సి ఉంది. కాలువలో తూములు పూడిపోయి ఉండడంతో ఇంతవరకు నీరు రాలేదు. బోర్ల కింద నారుమడులు పోసుకున్నాం. ఆయిల్ ఇంజిన్లతో నీరు పెట్టుకొని నాట్లకు సిద్ధం చేసుకొంటున్నా. ఆయిల్ ఖర్చు తడిసి మోపెడు అవుతోంది. ఇలాగైతే వరిసాగెలా చేపట్టాలి.

– జి.రాము, కౌలురైతు, మంటాడ

సాగు, తాగునీరు సరఫరా చేయండి



భాస్కరరావుపేటలో మాట్లాడుతున్న మహంకాళిరావు

కైకలూరు: శివారు లంక గ్రామ ప్రజలకు తాగు, సాగునీరు అందించాలని సీపీఎం కలిదిండి, ముదినేపల్లి మండలాల ప్రాంతీయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కలిదిండి మండలం భాస్కరరావుపేటలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ ఉప్పుటేరులో నీరు ఇంకా ఉప్పుగానే ఉండడంతో చెరువులలో నీరు అడుగంటి చేపలు ఎదుగుదల లేక చనిపోతున్నాయన్నారు. తాగునీటి చెరువుల్లో నీరు అడుగంటుతున్నాయన్నారు. ఆక్వా సాగుతో ప్రభుత్వానికి అత్యధిక ఆదాయాన్ని సమకూరుస్తున్న లంక గ్రామాల రైతులు, ప్రజలు సాగునీరు తాగునీటి సమస్యతో ఇబ్బందిపడటం అత్యంత బాధాకరమన్నారు. ప్రధానంగా రోడ్ల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. ప్రభుత్వం సత్వరం స్పందించి వంతుల వారీగా కాకుండా రైతాంగానికి కావాల్సిన సాగునీరు, మంచినీళ్ల చెరువులు నింపుకోవడానికి సరిపడా నీరు విడుదల చేయాలన్నారు. మూలలంక–పెదలంక, కలిదిండి–తాడినాడ ఆర్అండ్‌బీ రోడ్లను వెంటనే నిర్మాణం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వి భాస్కరరావు.డీవీ సత్యనారాయణ, బి.రామనాగేంద్రరావు, ఎస్ఎస్‌వీ సత్యనారాయణ, వి.వరలక్ష్మీ, కే. రమేష్. జి.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామిని దర్శించుకున్న మాజీ గవర్నర్ సతీమణి



మాజీ గవర్నర్ సతీమణి, కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న దృశ్యం

మండవల్లి: మండవల్లిలో కొలువైఉన్న శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామిని మండవల్లికి చెందిన సిక్కిం మాజీ గవర్నర్ వెంట్రప్రగడ రామారావు సతీమణి, కుటుంబ సభ్యులు ఆదివారం దర్శించుకున్నారు. మాజీ గవర్నర్ సతీమణి అన్నపూర్ణ, కుమారుడు శ్రీనివాసరావు, మేనల్లుడ్లు తదతరులు కలిసి సొంత గ్రామాన్ని, మల్లేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు గూడూరు శ్రీనివాసరావు, గూడూరు భవానిశంకరశాస్త్రి, స్వస్తివాచకులు కామేశ్వర శర్మ, హరి రవి ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. రంగారావు, రాఘవులు, గణేష్, దివాకర్ వారి కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు



సుబ్బారాయుడిని దర్శించుకుంటున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. భక్తుల అన్నదాన కార్యక్రమానికి ఆలయ సహాయ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేశారు.

బాలమ్మకు ఆషాఢ సారె



సారె తీసుకెళుతున్న భక్తులు

కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడిలోని నాట్యాచార్యుల ఇలవేల్పు గంగా బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర ఆలయంలోని అమ్మవారికి ఆదివారం గ్రామంలోని మహిళలు భక్తి శ్రద్ధలతో ఆషాఢ సారెను సమర్పించారు. గ్రామానికి చెందిన భాగవతుల శ్రీ నాగమణి ఆధ్వర్యంలో మహిళలు ఈ సారెను అమ్మవారికి సమర్పించారు. ఆలయ అర్చకులు పెనుమూడి పూర్ణ చంద్ర శేఖర శర్మ విశేష పూజలు నిర్వహించారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: మండలంలోని వడాలిలో శ్రీకనకదుర్గమ్మకు, శ్రీసుభద్రబలరామ సహిత శ్రీజగన్నాథస్వామి ఆలయంలో అమ్మవారికి మహిళలు భక్తిశ్రద్ధలతో ఆషాఢ సారెను ఆదివారం సమర్పించారు. అధిక సంఖ్యలో మహిళలు ఎర్రటి వస్త్రాలు ధరించి బోనాలు నెత్తిన పెట్టుకుని డప్పువాయిద్యాలు, విచిత్ర వేషధారణ నడుమ కనకదుర్గమ్మ ఆలయానికి తరలి వెళ్లి సారెను సమర్పించారు. నక్కా అప్పారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా వందలాదిమంది మహిళలు స్థానిక శ్రీసుభద్రబలరామ సహిత శ్రీజగన్నాథ స్వామి ఆలయానికి తరలివెళ్లి అర్చకుడు శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు.



వడాలిలో కనకదుర్గమ్మకు బోనాలు సమర్పించేందుకు వెళుతున్న మహిళలు



వడాలి శ్రీసుభద్రబలరామ సహిత జగన్నాథస్వామి ఆలయంలో సారె సమర్పణలో మహిళలు



కైకలూరులో అమ్మవారికి సారెను సమర్పిస్తున్న మహిళలు

మండవల్లిలో..

మండవల్లి: మండవల్లిలో శ్రీ విజయదుర్గాదేవి, శ్రీ గంగానమ్మ అమ్మవార్లకు భక్తులు ఆదివారం ఆషాఢ సారె సమర్పించారు. పండితులు సీహెచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో భక్తులు మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవార్లకు పసుపు, కుంకుమ, చీర, గాజులు, పండ్లు సమర్పించారు. గంగానమ్మ అమ్మవారిని అర్చకులు గూడూరు శ్రీనివాసరావు పలు రకాల కూరగాయలతో శాకంబరీదేవిగా అలంకరించారు.

కైకలూరులో..

కైకలూరు: కైకలూరు శ్యామలాంబ అమ్మవారి క్షేత్రంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీమాతకు ఆదివారం ఆషాఢ సారె సమర్పించారు. బ్రహ్మంగారి గుడి వీధి, వెలంపేటకు చెందిన మహిళా భక్తులు సారెను సమర్పించారు. అమ్మవారి దేవస్థానం చుట్టూ ప్రదక్షిణలు చేసిన మహిళలు అమ్మవారికి సారెను సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ వీఎస్‌కే.శేఖర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఉప్పాల దంపతులపై దాడి దుర్మార్గం



లుక్కా వెంకట శ్రీనివాసరావు

తోట్లవల్లూరు: గుడివాడలో జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, రాము దంపతులపై టీడీపీ అల్లరిమూకలు దాడి చేయటం దుర్మార్గమైన చర్య అని బీసీ జనగణన సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు లుక్కా వెంకట శ్రీనివాసరావు అన్నారు. గౌడ సామాజిక వర్గానికి చెందిన హారిక, రాము దంపతుల కారుపై టీడీపీ గూండాలు దాడి చేయటమే కాకుండా, కారును నడిరోడ్డుపై నిర్బంధించి పరుషపదజాలంతో దూషించటం బాధాకరమన్నారు. బీసీ జనగణన సాధన సమితి తరపున ఉప్పాల దంపతులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడి కారకులను గుర్తించి, పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓ బీసీ మహిళను నడిరోడ్డుపై నిలబెట్టి కన్నీరు తెప్పించటం ఎంత వరకు సబబో పాలకులు ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని లుక్కా కూటమి నాయకులను హెచ్చరించారు.

హారికపై దాడి దారుణం

పామర్రు: కృష్ణా జిల్లా జెడ్పీ చైర్ పర్సన్‌పై జరిగిన దాడిని ముక్త కంఠంతో ఖండిస్తున్నామని వైఎస్సార్ సీపీ మహిళా నాయకులు ప్రభుత్వ తీరును ఎండగట్టారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా నాయకులు మాట్లాడుతూ ఒక బీసీ మహిళ, జెడ్పీ చైర్‌పర్సన్‌కే ఈ రాష్ట్రంలో రక్షణ లేదని, ఇక సామాన్య మహిళల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఉన్నత స్థానంలో ఉన్న మహిళను, ఆమె భర్తపై పట్ట పగలే టీడీపీ, జనసేన నాయకులు దాడి చేయడం దారుణమన్నారు. ఎటువంటి సంకేతాలను కూటమి ప్రభుత్వం ప్రజలకు అందిస్తుందో తెలియజేయాలన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో ప్రశ్నించే గొంతుకలను నొక్కడం అమానుషమన్నారు. కార్యక్రమంలో పమిడిముక్కల, మొవ్వ జెడ్పీటీసీ సభ్యులు ఏనుగు వెంకట రమణకుమారి, రాజులపాటి శివ పార్వతి, మొవ్వ ఎంపీపీ కుందేటి ఇందిర, పెదముత్తేవి ఎంపీటీసీ సభ్యురాలు ఉప్పలపాటి జ్యోతి, పామర్రు వైస్ ఎంపీపీ ఆరుమళ్ల రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



పామర్రులో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మహిళా నాయకులు

మహిళ కంటతడి రాజ్యాలను కూల్చేసింది

గుడివాడ టౌన్: ఒక మహిళ కంటతడి రాజ్యాలను, ప్రభుత్వాలను కూల్చేసిన సంఘటనలు చరిత్రలో ఎన్నో ఉన్నాయని నందివాడ జెడ్పీటీసీ సభ్యురాలు కందుల దుర్గ అన్నారు. ఆదివారం స్థానిక రాజేంద్ర నగర్ లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నియోజకవర్గ మహిళా విభాగం ఆధ్వర్యంలో విలేకరులతో మాట్లాడారు. ఒక బీసీ మహిళ అందులో జిల్లా ప్రథమ పౌరురాలు ఉప్పాల హారికపై టీడీపీ, జనసేన గూండాలు దాడులకు దిగడం, దూషించడం నీచమైన చర్య అన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షురాలు మాదాసు వెంకట లక్ష్మీకుమారి, మహిళా కార్యకర్తలు మూడెడ్ల ఉమ, హారిక, రమీజా, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా జిల్లా ప్రథమ పౌరురాలికే రక్షణ కరువు

పామర్రు: ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రథమ పౌరురాలు, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికకు రక్షణ కల్పించలేని రాష్ట్ర ప్రభుత్వం, సాధారణ మహిళలకు ఏవిధంగా రక్షణ కల్పిస్తుందని వైఎస్సార్ సీపీ గౌడ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మాదు శివరామకృష్ణ ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం గద్దె దిగాలని డిమాండ్ చేశారు. కృష్ణా జిల్లా పామర్రులోని మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఉప్పాల హారికపై టీడీపీ, జనసేన పార్టీ గూండాలు చేసిన దాడిని తీవ్రంగా ఖండించారు. జిల్లాకే ప్రథమ పౌరురాలిగా ఉన్న హారికకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వం, ఆమెకు సెక్యూరిటీగా ఉన్న గన్‌మెన్‌లను తొలగించిన పరిస్థితి దేశంలో ఎక్కడా లేదన్నారు. ఇది రాజ్యాంగం కల్పిన హక్కులను కాలరాయటం కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో భారత రాజ్యాంగానికి బదులు రెడ్ బుక్ పాలన జరుగుతోందని దుయ్యబట్టారు. జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఆల రమేష్‌బాబు, నాయకులు శొంఠి వెంకటేశ్వరరావు, మోర్ల రామచంద్రరరావు, రాజులపాటి రాఘవరావు, జంపాలన కొండలరావు పాల్గొన్నారు.



గుడివాడలో విలేకరులతో మాట్లాడుతున్న మహిళా కార్యకర్తలు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ గౌడ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మాదు శివరామకృష్ణ

భక్తిశ్రద్ధలతో కోటి దత్తహోమం



లోకుమూడి దత్తాశ్రమంలో కోటి దత్తహోమం



సుదర్శన హోమం చేస్తున్న అర్చకులు

కైకలూరు: ప్రపంచ శాంతి కోసం లోకుమూడి దత్తాశ్రమంలో కోటి దత్తహోమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. యాగ్నికులు తరుణ్, రోహిత్ శర్మ, మూర్తి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి ఋత్విక్కులు కోటి దత్త హోమ కార్యక్రమానికి హాజరయ్యారు. దత్తాశ్రమ ఎక్జిక్యూటివ్ ట్రస్టీ గురజాడ ఉదయశంకర్, కనకదుర్గ దంపతులు యాగకర్తలుగా వ్యవహరించారు, అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు.

వెంకన్న ఆలయంలో సుదర్శన హోమం

పమిడిముక్కల: మంటాడ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రవణా నక్షత్రం సందర్భంగా సుదర్శన హోమం చేశారు. పరిసర గ్రామల నుంచి భక్తులు తరలివచ్చి పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

రెండు లారీలు ఢీ.. డ్రైవర్లకు గాయాలు

పెడన: మండల పరిధిలోని 216 జాతీయ రహదారిపై బల్లిపర్రు సమీపంలో రెండు లారీలు ఎదురెదుగా వస్తూ ఢీ కొన్న ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లకు తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం జరిగింది. పెడన పోలీసుల కథనం మేరకు.. అమలాపురం మండలం నడుపూడి గ్రామానికి చెందిన ఐషర్ వ్యాన్ లారీ డ్రైవరు భైరిశెట్టి నాగేశ్వరరావు, వీరులపాడు గ్రామానికి చెందిన మరో లారీ డ్రైవర్ రామశెట్టి రామకృష్ణ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రామకృష్ణ లారీ క్లీనర్ బాషాకు ఎటువంటి గాయాలు కాలేదు. పెడన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఎదురెదురుగా వస్తూ ఢీకొన్న లారీలు

బీసీ, ఎస్సీలను అణగదొక్కేందుకు కూటమి కుట్ర



గుడివాడలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గుడివాడ టౌన్: రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, మైనార్టీలను అణగదొక్కేందుకు కూటమి ప్రభుత్వం అధికారం చెలాయిస్తుందని వైఎస్సార్ సీపీ నాయకులు విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శనివారం పట్టణంలో చోటుచేసుకున్న పరిణామాలు అత్యంత హేయమైనవని అన్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం అల్లర్లు సృష్టించడం కూటమి ప్రభుత్వానికే చెల్లుతుందన్నారు. ప్రజాస్వామ్యంలో ఒక పార్టీ తన కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసుకోవడం సహజమన్నారు. ఇందులో పాల్గొనేందుకు వస్తున్న జిల్లా ప్రథమ పౌరురాలు, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఉప్పాల హారిక దంపతుల వాహనాన్ని అడ్డుకుని రాళ్లతో దాడిచేసి కారు అద్దాలు పగలగొట్టడం దుర్మార్గపు చర్య అన్నారు. గంటకు పైబడి వాహనాన్ని నిలిపివేసి నోటితో చెప్పలేని బూతులు మాట్లాడటం వారి నీచ సంస్కృతికి పరాకాష్ట అని అన్నారు. ఒక బీసీ మహిళ అని చూడకుండా ఈ విధమైన దాడులు చేయడం పోలీసులు ఈ విషయంలో చేతులెత్తేయడం సరికాదన్నారు. కవ్వింపు చర్యలకు పాల్పడటం, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసేందుకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు బాధ్యత వహించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ క్షమాపణ చెప్పాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు మండలి హనుమంతరావు, పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, జిల్లా అధికార ప్రతినిధి ఎంవీ నారాయణరెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మట్టా జాన్ విక్టర్, జెడ్పీటీసీ జి.రామకృష్ణ, ఎంపీపీ పెయ్యల ఆదాము, మైనార్టీ సెల్ మాజీ డైరెక్టర్ షేక్ సయ్యద్, రాష్ట్ర కమిటీ సభ్యుడు షేక్ బాజీ, సీనియర్ నాయకులు చుండూరి శేఖర్, కె.ఆంజనేయప్రసాదు, న్యాయవాది మురళి, తోట నాగరాజు, తులిమిల్లి యేషయ్య, కందుల నాగరాజు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కైకలూరు: ఎలుకల మందు తాగిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. రూరల్ పోలీసుల కథనం మేరకు.. కైకలూరు మండలం ఆలపాడుకు చెందిన బొర్రా వెంకట మధుబాబు(27) ఇదే గ్రామానికి చెందిన మేరీ అనే యువతిని ప్రేమించి ఇటీవల వివాహం చేసుకుని విడిగా ఉంటున్నాడు. కొద్ది రోజుల క్రితం విభేదాల వల్ల భార్య పుట్టింటికి వెళ్లింది. ఇదే సమయంలో కైకలూరుకు చెందిన ఓ ఫైనాన్స్ కంపెనీ కిస్తీలు చెల్లించలేదని ద్విచక్ర వాహనాన్ని తీసుకెళ్లారు. దీంతో కలత చెందిన మధుబాబు మనస్తాపంతో ఈ నెల 7వ తేదీన ఎలుకల మందు తాగాడు. కుటుంబ సభ్యులు భీమవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మరణించాడు. తండ్రి లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ రాంబాబు కేసు నమోదు చేశారు.